బస్టాండ్‌లో సమస్యల హోల్ట్!

- అభివృద్ధికి నోచుకోని బస్టాండ్
- అధ్వానంగా పరిసరాలు
- చినుకు పడితే చెరువే
- తాగునీటి వసతి లేక ఇబ్బందులు
- అసౌకర్యాల నడుమ ప్రయాణాలు



కంకిపాడు బస్టాండు

కంకిపాడు: బస్టాండు అభివృద్ధి నేతల మాటలకే పరిమితం అవుతోంది. పాలకులు మారుతున్నారే కానీ, బస్టాండు మాత్రం ప్రగతికి నోచుకోవటం లేదు. చిన్న పాటి చినుకులకే ప్రాంగణం మొత్తం చెరువుగా మారుతోంది. తాగునీటి వసతి కూడా లేక ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తోంది. మరుగుదొడ్ల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండటంతో అసౌకర్యాల నడుమ ప్రయాణికులు అవస్థలు పడుతూ ప్రయాణాలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది.

40కి పైగా గ్రామాలకు కూడలి

విజయవాడ– మచిలీపట్నం మార్గ మధ్యంలో ఆటోనగర్ తరువాత ఉన్న ప్రధాన బస్టాండుల్లో కంకిపాడు ఒకటి. ఒకప్పుడు విజయవాడ డిపో పరిధిలో ఉండే బస్టాండు ప్రస్తుతం ఉయ్యూరు ఆర్టీసీ డిపో పరిధిలో నడుస్తోంది. విజయవాడ–మచిలీపట్నం, అవనిగడ్డ, గుడివాడ, భీమవరం, గన్నవరం పరిసర ప్రాంతాలకు బస్టాండ్ల మీదుగా బస్సు సర్వీసులు నడుస్తున్నాయి. సుమారు 40 గ్రామాలకు కంకిపాడు కూడలి. కంకిపాడు, ఉంగుటూరు, తోట్లవల్లూరు మండలాల్లోని గ్రామాలకు చెందిన ప్రజలు కంకిపాడు బస్టాండుకు వచ్చి తమ తమ గమ్యస్థానాలకు చేరుతున్నారు.

అధ్వానంగా పరిసరాలు

బస్టాండు ప్రాంగణం ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోవటం లేదు. ప్రాంగణం పల్లంగా ఉండటంతో చిన్నపాటి వర్షానికే చెరువుగా మారుతోంది. దీనికి తోడు బస్టాండు ముఖద్వారంలో డ్రెయినేజీ పైపులు పగిలిపోయి ఉండటంతో డ్రెయిన్లు పొంగిన ప్రతి సారీ మురుగు అంతా బస్టాండులోకి చేరి పరిసరాలు అధ్వానంగా మారుతున్నాయి. మురుగులో ఇబ్బందులు పడుతూ ప్రయాణికులు బస్సులు ఎక్కాల్సి వస్తోంది. ధ్వంసమైన డ్రెయినేజీ తూములను మార్పు చేస్తేనే సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

తాగునీటికి చింత

దాతల సహకారంతో బస్టాండుకు వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్‌ఓ ప్లాంటును అమర్చారు. అది కాస్తా నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం సురక్షిత తాగునీరు ప్రయాణికులకు అందటం లేదు. పంచాయతీ నీటి కుళాయిల ద్వారా ట్యాంకుల్లోకి మళ్లించిన తాగునీటినే ప్రయాణికులు వాడుకోవాల్సి వస్తోంది. దీంతో ప్రయాణికులు తాగునీటికి అవస్థలు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు బస్టాండులో ఉన్న మరుగుదొడ్ల నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది.

దుర్వాసనతో ఇబ్బందులు

మరుగుదొడ్ల నిర్వహణ లోపం కారణంగా కంపుకొడుతున్నాయి. తీవ్ర దుర్గంధం వెలువడుతుండటంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. నలుగురు కార్మికులు బస్టాండు పరిసరాలు, మరుగుదొడ్ల నిర్వహణ చేపట్టాల్సి ఉండగా కేవలం ఒక్కరే కార్మికురాలు అందుబాటులో ఉన్నారు. దీంతో పరిసరాలు, మరుగుదొడ్ల నిర్వహణ అధ్వానంగా మారిందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు బస్టాండు ప్రాంగణాన్ని కొందరు బహిరంగంగా మలమూత్ర విసర్జనకు వాడుతున్నారు. దీంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. బస్టాండు పరిసరాల్లో నివాసితులు ఈ దుర్గంధం భరించలేక నానా అవస్థ పడుతున్నారు.

మందుబాబుల ఆగడాలు

రాత్రిళ్లు మందుబాబుల ఆగడాలు పెచ్చుమీరిపోతుండటంతో ప్రయాణికులు బస్టాండు ప్రాంగణంలో నిలబడే పరిస్థితి లేకపోతుంది. అసౌకర్యాలకు నెలవుగా బస్టాండు మారిందని ప్రయాణికులు వాపోతున్నారు. ఆర్టీసీ అధికారులు ఇప్పటికైనా స్పందించి బస్టాండులో ప్రయాణికుల అవస్థలకు చెక్ పడేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు



నిర్వహణలేని తాగునీటి కుళాయిలు



అధ్వానంగా మరుగుదొడ్లు

క్లుప్తంగా

ఏఎంసీ ప్రమాణ స్వీకారం



గన్నవరం: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం ఆదివారం కొలువుదీరింది. వ్యవసాయ మార్కెట్ యార్డులో జరిగిన ఈ కార్యక్రమంలో నూతన చైర్మన్‌గా గూడవల్లి నరసింహారావు, వైస్ చైర్మన్‌గా కొండేటి వెంకటేశ్వరరావు, మరో 15 మంది డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. కమిటీ గౌరవ చైర్మన్ హోదాలో హాజరైన ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు నూతన కమిటీని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ మార్కెట్ యార్డు అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి నూతన పాలకవర్గం కృషి చేయాలని ఆకాంక్షించారు. కమిటీ పరిధిలోని రైతులకు ఉపయోగపడే డొంక రోడ్ల అభివృద్ధిపై దృష్టి సారించాలని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే దాసరి వెంకటబాలవర్ధనరావు, బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి, పలువురు టీడీపీ, జనసేన, బీజేపీకి చెందిన నాయకులు పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం



నున్న(విజయవాడరూరల్): స్థానిక శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానానికి నూతన ధర్మకర్తల మండలి ప్రమాణస్వీకారం ఆదివారం ఆలయ ప్రాంగణంలో జరిగింది. చైర్మన్ భీమవరపు శంకరరెడ్డి, డైరెక్టర్లు మున్నంగి శ్రీహరి, తల్లిబోయిన దుర్గారావమ్మ, దర్శి సుజాతలక్ష్మి, యనగంటి సాంబశివరావు, అంగజాల శివయ్య, నల్లూరి ప్రసాదరావు, బేతపూడి చిన్ని, వడ్లపూడి పుణ్యవతి, ఎక్స్ అఫీషియో సభ్యుడిగా అర్చకుడు డాక్టర్ మామిళ్లపల్లి ఫణికుమార్‌లతో ఈవో ఎస్.హేమలతాదేవి ప్రమాణస్వీకారం చేయించారు. ధర్మకర్తల మండలి రెండు సంవత్సరాల పాటు కొనసాగుతారని ఈఓ తెలియచేశారు.

వయోజనులు ధార్మిక అభివృద్ధి సాధించాలి



కంకిపాడు: అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ ఉమ్మడి కృష్ణాజిల్లా వయోజన సమితి ఆధ్వర్యంలో వయోజనుల ఆధ్యాత్మిక వార్షిక సమావేశం కుందేరు గ్రామంలో ఆదివారం నిర్వహించారు. ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షుడు షేక్ నాగూర్ మీరావలి అధ్యక్షత వహించారు. జాతీయ ప్రతినిధి షేక్ రిజ్వాన్ సలీం ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ వయోజనులు ధార్మిక అభివృద్ధి సాధించాలన్నారు. తమ కుటుంబాన్ని ఆధ్యాత్మికత వైపు నడిపించాలన్నారు. యువత చెడు ప్రభావాలకు లోనై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, వారిని సన్మార్గంలో నడిపించాలన్నారు. ఈ సందర్భంగా ధార్మిక విద్యాపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కృష్ణా, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిలాలల ఇన్‌చార్జిలు యాకూబ్ పాషా, జాఫర్ ఖాన్, సిరాజ్ నూరుల్ ఇస్లాం మిషనరీ ఇన్‌చార్జి జావేద్, ఉమ్మడి వరంగల వయోజన సమితి అధ్యక్షుడు ముహమ్మద్ సలీం, స్థానిక నాయకులు షేక్ సిలార్, మౌల్వీ అమీరుద్దీన్, కటాక్షపూర్ అక్బర్, మునవ్వర్ మస్తాన్, రియాజ్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

ఘనంగా నారాయణదాసు జయంతి ఉత్సవాలు



విజయవాడకల్చరల్: సత్యనారాయణపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు జయంతి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదిభట్ల నారాయణదాసు శిష్యప్రశిష్య బృందం, అన్నమయ్య పరివార్ (హైదరాబాద్), శంకర నారాయణ ప్లాంజీరీ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం నాటి కార్యక్రమంలో నూకల యజ్ఞనారాయణ శర్మ భక్త అంరీష, టి.శిరీష శివపర్యటన, పరాయతనం నారాయణరావుచే భక్త శబరి, వై శిఖామణి భాగవతార్ వల్లీ కలాణం కథలను గానం చేశారు. అనంతరం సంగీత విద్వాంసురాలు దుర్గాభవాని మాట్లాడుతూ హరికథలకు పూర్వవైభవం తీసుకురావాలని సూచించారు. ఉదయం కళాకారులు ఆదిభట్ల నారాయణదాసు విగ్రహానికి పూజాదికాలు నిర్వహించారు. పేద కళాకారులను సత్కరించారు.

శ్మశాన వాటిక అభివృద్ధికి సాయం



శ్మశాన వాటిక అభివృద్ధికి సాయం అందిస్తున్న దేవభక్తుని చక్రవర్తి

కంకిపాడు: దళిత శ్మశాన వాటికల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి డిమాండ్ చేశారు. కాసూరులోని ఆయన కార్యాలయంలో ఉప్పలూరు దళిత శ్మశాన వాటిక అభివృద్ధికి తన వంతుగా రూ.10 వేలు ఆర్థిక సాయం ఆదివారం అందించారు. చక్రవర్తి మాట్లాడుతూ దళిత శ్మశానవాటికల్లో సౌకర్యాలు కరువై పేదలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దళితులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు మాగంటి శ్రీనివాసరావు, జిల్లా నేత బండెల సుబ్బారావు, నాయకులు నెరుసు నాని, శ్రీమన్నారాయణ, వేము మాణిక్యాలరావు, గంటా సుబ్బారావు (నాని), సుందరయ్య, సిహెచ్ రాజా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవం

గన్నవరం: స్థానిక బుద్దవరం రోడ్డులో ప్రెస్‌క్లబ్ వద్ద ఆదివారం ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే జెండాను యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు అట్లూరి రాజశేఖర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 1957లో మానికొండ చలపతిరావు ఏర్పాటు చేసిన యూనియన్ అంచలంచెలుగా ఎదుగుతూ 13 వేల సభ్యత్వాలకు చేరుకుందన్నారు. అప్పటి నుంచి జర్నలిస్టుల సమస్యలపై నిరంతరం పోరాటాలు సాగిస్తున్నట్లు చెప్పారు. జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్లు ఇవ్వాలని, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూనియన్ నేతలు నిరీక్షణ రావు, అప్పారావు, రామకృష్ణ, కరుణాకర్, గౌరిశంకర్, శివరాంబాబు తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారాలకు ప్రోత్సాహం

పెనమలూరు: సెర్ప్ సాయంతో డ్వాక్రా మహిళకు చిరు వ్యాపారం చేసేందుకు రూ.50 వేల విలువ చేసే ఎగ్ కార్ట్ ఉచితంగా అందజేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే బోడెప్రసాద్ ఎగ్ కార్ట్‌ను గోసాల గ్రామానికి చెందిన భద్రావతి గ్రూప్ సభ్యురాలు డ్వాక్రా మహిళ బిల్లా రాజ్యలక్ష్మికి ఆదివారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందటానికి, వివిధ రకాల వ్యాపారాల వ్యాపారాలు నిర్వహించేందుకు ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. కోడి గుడ్ల వాడకాన్ని ప్రోత్సహించటానికి నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ (నెక్)తో ప్రభుత్వం ఒప్పందం చేసుకున్నందున సెర్ప్ సహకారంతో రాష్ట్రంలో వెయ్యి మంది డ్వాక్రా మహిళలకు ఎగ్‌కార్ట్‌లు అందించనున్నారని తెలిపారు. ఏపీఎం కృష్ణంరాజు, టీడీపీ నేతలు మారుపూడి ధనకోటేశ్వరరావు, అనుమోలు ప్రభాకర రావు, కోయా ఆనంద్‌ప్రసాద్, మాబుసుభాని, సంగెపు రంగారావు పలువురు పాల్గొన్నారు.



డ్వాక్రా మహిళకు ఎగ్‌కార్ట్ అందజేసిన ఎమ్మెల్యే బోడె ప్రసాద్, పక్కన నాయకులు

అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి భూమి పూజ

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ఐటీఐ రోడ్డులోని శ్రీశైల మల్లికార్జునస్వామి దేవస్థానం ప్రాంగణంలో నిర్మించ తలపెట్టిన శ్రీహరిహర సుత అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పురోహితులు విశేషపూజలు, హోమాలు చేశారు. అధికసంఖ్యలో గ్రామస్తులు పూజాకార్యక్రమాలకు హాజరయ్యారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. మాజీ సర్పంచ్ కాకాని అరుణ, పుర ప్రముఖులు నందూరు సత్యవెంకటేశ్వరశర్మ, కొల్లి వెంకట్రావు, గూడపాటి రత్నశేఖర్, తుమ్మల నారాయణరావు, తమిరి రమేష్, ఆలయ కమిటీ చైర్మన్ గూడవల్లి వెంకట దుర్గా వరప్రసాద్ పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న అర్చకులు, పుర ప్రముఖులు

అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో అడ్మిషన్లు చేపట్టండి

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2025–26 సంవత్సరానికి గాను అడ్మిషన్లు చేపట్టాలని ఇండియన్ అంబేడ్కర్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు యు.తారకప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూనివర్సిటీ ఏర్పాటుకు కేబినెట్ నిర్ణయం తీసుకుని ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ కార్యరూపం దాల్చలేదన్నారు. డాక్టర్ తారకప్రసాద్ ఆదివారం మాట్లాడుతూ.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీకి సిబ్బందిని, వైస్ చాన్సలర్, రిజిస్ట్రార్‌లను నియ మించాలన్నారు.లేకపోతే విద్యాసంవత్సరం కోల్పోవాల్సి వస్తుందని చెప్పారు. మంత్రి లోకేష్ వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీని ఏలూరులో కాకుండాఅమరావతిలోనే ఏర్పాటు చేయాలన్నారు.

కన్వెన్షన్ సెంటర్ పూర్తి చేయండి..

నగరంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనంలోని కన్వెన్షన్ సెంటర్‌ను వెంటనే పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరం మధ్యలో అతిపెద్ద కన్వెన్షన్ సెంటర్ అందుబాటులోకి వస్తే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ వెంటనే విడుదల చేయాలని, గురుకుల విద్యాలయాల్లో వసతులు కల్పించాలని, అంబేడ్కర్ స్టడీ సర్కిల్‌లో యూపీఎస్సీ, ఏపీపీఎస్సీ, ఎస్ఎస్‌సీ, రైల్వే బ్యాంకింగ్ ఉద్యోగులకు శిక్షణ ఇవ్వాలన్నారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను ఎస్సీల అభివృద్ధి కోసమే ఖర్చు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మధురంగా సాగిన గాత్ర సంగీత సభ

విజయవాడకల్చరల్: బీఆర్‌టీఎస్ రోడ్డులోని శివరామకృష్ణ క్షేత్రంలోని శ్రవణ సదనంలో స్వరఝరి ఆధ్వర్యంలో సంగీత విద్వాంసుడు పెమ్మరాజు సూర్యారావు స్మృత్యర్థం ఆదివారం సంగీత కార్యక్రమం వాగ్గేయకారుల కృతి వైభవాన్ని చాటింది. తమిళనాడుకు చెందిన ప్రముఖ సంగీత విద్వాంసుడు భరత్ సుందర్ నిర్వహించిన కర్నాటక సంగీత సభ మధురంగా సాగింది. సంగీత త్రిమూర్తులు త్యాగరాజస్వామి, ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రిలు స్వరపరచిన కీర్తనలను ఆలపించారు. శ్రీ సాయి రక్షిత్, పారుపల్లి సుబ్బరాయఫల్గుణ్, మార్టూరి హరిబాబు వాయిద్య సహకారం అందించారు. స్వరఝరి ప్రధాన కార్యదర్శి మోదుమూడి సుధాకర్ మాట్లాడుతూ శాస్త్రీయ సంగీతం నిరంతరం ప్రవహించే స్వరఝరి అన్నారు. సంగీత విద్వాంసుడు భరత్ సంగీత సేవలను వివరించారు.



వాగ్గేయకార కీర్తనలు ఆలపిస్తున్న భరత్ సుందర్

నేత్రపర్వంగా వేణుగోపాలుని నగరోత్సవం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కృష్ణాష్టమిని పురస్కరించుకొని వన్‌టౌన్‌లోని పలు ప్రాంతాల్లో ఉట్టి మహోత్సవాలు ఆదివారం రాత్రి అత్యంత వైభవంగా జరిగాయి. కేటీ రోడ్డు, బ్రాహ్మణవీధి, నెహ్రూబొమ్మ సెంటర్‌తో పాటుగా పలు ప్రాంతాల్లో యువజన సంఘాలు, కులసంఘాల ఆధ్వర్యంలో ఉట్టి మహోత్సవాలు నిర్వహించారు. స్థానిక నెహ్రూబొమ్మ సెంటర్‌లోని శ్రీ వేణుగోపాలస్వామి వారి దేవస్థానంలో స్వామి వారి నగరోత్సవంగా ఆయా ప్రాంతాలకు తరలిరాగా స్థానికంగా ఏర్పాటు చేసిన ఉట్టి మహోత్సవ నిర్వాహకులు స్వామికి పూజలు నిర్వహించి ఉట్టి కొట్టే కార్యక్రమాలను నిర్వహించారు. ఆయా ప్రాంతాలు సందడిగా దర్శనమిచ్చాయి. ఉట్టి కొట్టే వ్యక్తులపై ఒక వైపు రంగులు, మరోవైపు నీటిని బలంగా విసురుతుండగా పైన ఉన్న కలశాన్ని కొట్టి యువకులు సందడి చేశారు. స్వామివారి సన్నిధి నుంచి ప్రారంభమై కేటీ రోడ్డు, శేషయ్యవీధి, బ్రాహ్మణవీధి తదితర ప్రాంతాల మీదుగా తిరిగి ఆలయానికి చేరుకుంది.



విశేష అలంకరణలో స్వామివారు

అంధకారంలో యనమలకుదురు

వెలగని వీధి దీపాలు

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధి యనమలకుదురు గ్రామం అంధకారం కొనసాగుతోంది. గ్రామంలో వీధి దీపాలు వెలగటం లేదు. రాత్రి వచ్చిందంటే గ్రామ ప్రజలు చిమ్మ చీకట్లలో ఉండాల్సి వస్తోంది. యనమలకుదురు గ్రామంలో 70 వేల మంది జనాభా ఉన్నారు. ఈ గ్రామంలో ఇటీవల కాలంలో స్థిర నివాసాలు బాగా ఏర్పడ్డాయి. గ్రామ జనాభా కూడా నానాటికీ పెరిగిపోతోంది. గ్రామం నుంచి తాడిగడప మున్సిపాలిటీకి పన్నుల రూపంలో ఆదాయం బాగానే వస్తోంది. తాడిగడప మున్సిపాలిటీ పాలకుల నిర్లక్ష్యం కారణంగా గ్రామస్తులు రాత్రి సమయాలలో అంధకారంలో గడపాల్సి వస్తోంది.



అంధకారంలో ఉన్న యనమలకుదురు

సమస్య చెప్పినా స్పందించరు

వీధి దీపాలు వేయండని గ్రామస్తులు కోరుతున్నా ఎవరూ స్పందించటం లేదని చెబుతున్నారు. రాత్రి అయిందటంటే గ్రామంలో ఎక్కడ చూసినా చిమ్మచీకట్లే కనబడుతున్నాయి. ప్రధాన వీధుల్లో వీధి దీపాలు వెలగటం లేదు. ఎస్సీ కాలనీ, ప్రియదర్శినినగర్, సాయినగర్, భగత్‌సింగ్‌నగర్, డబ్బాపంపు సెంటర్, దుర్గానగర్ ఇలా అనేక వీధుల్లో వీధి దీపాలు వెలగటం లేదు. రాత్రి వచ్చిదంటే గ్రామ ప్రజలు చీకట్లో గడపాల్సివస్తోంది.

రాత్రి వేళల్లో విషకీటకాలు, వీధి కుక్కలతో బెడద ఉంటుందని, వీధి దీపాలు వెలగక పోవటంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ నేతల సిఫారసు కావాలా?

వీధి దీపాలు వెలగటం లేదని ఆయా సచివాలయాలలో ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోవటం లేదని గ్రామస్తులు తెలిపారు. వీధి దీపాలు మరమ్మతులు చేయాలంటే టీడీపీ నేతలకు సలాం చేయాల్సి వస్తోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వెలగని వీధి దీపాల స్థానంలో కొత్తది వేయాలంటే టీడీపీ నేతల సిఫార్సు ఉంటేనే పని జరుగుతుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వీధి దీపాలు వెలిగించాల్సిన బాధ్యత తాడిగడప మున్సిపాలిటీ అధికారులదేనని, మరి టీడీపీ నేతల సిఫార్సులు ఎందుకని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

పన్నులు కట్టించుకుంటూనే..

పన్నులు కట్టించుకునే అధికారులు ప్రజల సమస్యలు ఎందుకు పరిష్కరించరని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా తాడిగడప మున్సిపాలిటీ అధికారులు స్పందించి గ్రామంలో వీధి దీపాలు వెలిగే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కొండ ప్రాంత ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలిరావాలి

మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర

భవానీపురం(విజయవాడపశ్చిమ): కొండ ప్రాంతాలు, వరద ముంపు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలి వచ్చి సిబ్బందికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర కోరారు. ఆదివారం సాయంత్రం ఆయన వివిధ శాఖాధిపతులు, స్పెషల్ ఆఫీసర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. కొండ ప్రాంతంతోపాటు వరద ముంపు ప్రాంతాల్లో ప్రమాదానికి గురయ్యే అవకాశాలు ఉన్న ఇళ్లు ఎన్ని, వాటిల్లో నివసిస్తున్న ప్రజలు ఎంత మంది ఉన్నారని అసిస్టెంట్ సిటీ ప్లానర్లను అడిగారు. సర్కిల్–1 అసిస్టెంట్ సిటీ ప్లానర్ చంద్రబోస్ మాట్లాడుతూ కొండ ప్రాంతాల్లో ప్రమాదానికి గురయ్యే ఇళ్లు 10 ఉన్నాయని చెప్పారు. సర్కిల్–3 అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్‌బాబు 15 ఉన్నాయని, వాటిల్లో అత్యంత ప్రమాదానికి గురయ్యే ఇళ్లు రెండు ఉన్నాయని తెలిపారు. వారికి ఎంత అవగాహన కల్పించినప్పటికీ ఇప్పుడు కాదు తరువాత వెళతామంటూ దాటేస్తున్నారని చెప్పారు.



మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర

పోలీసు, రెవెన్యూ శాఖల సహకారం తీసుకోండి..

అనంతరం కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ కొండ ప్రాంతంలో ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉన్న ఇళ్లను పూర్తి స్థాయిలో పరిశీలించి సంపూర్ణ నివేదికను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ వరద హెచ్చరికలు జారీ చేసిన దగ్గర నుంచి నగరపాలకసంస్థ అధికారులు అప్రమత్తమై ముంపు, కొండ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పిస్తున్నా వారు వినని పక్షంలో పోలీసులు, రెవెన్యూ శాఖ సహకారంతో పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. ప్రతి ముంపు ప్రాంతానికి దగ్గరలో అన్ని వసతులు కల్పించిన ఒక పునరావాస కేంద్రం ఉండేలా చూడాలని ఎస్టేట్ ఆఫీసర్ శ్రీధర్‌ను ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో ప్రజలకు భోజన సదుపాయాలను ముందుగానే ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. స్పెషల్ ఆఫీసర్లు తమతమ వార్డుల్లోని ముంపు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారికి కచ్చితంగా అవగాహన కల్పించి హెచ్చరికలు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు.

నేటి నుంచి తెలుగు భాష బోధనా సిబ్బందికి శిక్షణ

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): సోమవారం నుంచి ఆరు రోజుల పాటు తమ కళాశాల ఆవరణలోని వెబ్‌నార్ హాలులో తెలుగు భాష బోధనా సిబ్బందికి శిక్షణా శిబిరాన్ని నిర్వహిస్తున్నామని సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సిద్ధార్థ కళాశాల తెలుగు విభాగం, మైసూరులోని సీఐఐఎల్(సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్), నేషనల్ టెస్టింగ్ సర్వీస్ ఇండియా(మైసూర్) సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరం జరుగుతుందన్నారు. తెలుగులో పరీక్షలు, మూల్యాంకనం, ప్రశ్నాంశ రచన అనే అంశాలపై తరగతులు నిర్వహిస్తామన్నారు. తెలుగు ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఆచార్యులు, పరిశోధక విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు. సోమవారం ఉదయం 10 గంటలకు జరిగే ప్రారంభ సభలో సీఐఐఎల్ రిసోర్స్ పర్సన్ డాక్టర్ ఎం.నారాయణరెడ్డి, తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం నుంచి డాక్టర్ కె.రవిబాబు,సాహితీవేత్తలు పాల్గొంటారని తెలిపారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

గుణదల(విజయవాడతూర్పు): రౌడీషీటర్లు అసాంఘిక కార్యక్రమాలు, అవాంఛనీయ ఘటనలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని మాచవరం సీఐ సీహెచ్ ప్రకాష్ హెచ్చరించారు. స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ.. చెడు స్నేహాలు, చెడు అలవాట్ల ద్వారా జీవితం నాశనమవుతుందన్నారు. ఎస్ఐ శంకరరావు పాల్గొన్నారు.